

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

## రాజకీయ పార్టీల నాయకులు తమ అభిప్రాయాలు తెలుపాలి

### మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : రాజకీయ పార్టీల నాయకులు తమ అభిప్రాయాన్ని తెలుపాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు కోరారు. లోకసభ ఎన్నికల కసరత్తులో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో స్పెషల్ సమ్మరీ రివిజన్ – 2024పై రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, జిల్లాలో జనాభా ప్రాతిపదికన పోలింగ్ కేంద్రాల పెంపు వంటి అంశాలపై రాజకీయ పార్టీల నాయకుల అభిప్రాయం పరిగణలోకి తీసుకుంటామన్నారు. జనవరి 1వ తేదీ నాటికి 18 ఏండ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు.జనవరి 5 వరకు నమోదు, 6న ముసాయిదా ఓటరు జాబితా విడుదల, జనవరి 22 వరకు అభ్యంతరాల క్లెయిమ్స్ స్వీకరణ, ఫిబ్రవరి 2వ తేదీలోగా క్లెయిమ్స్ పరిష్కారం, ఫిబ్రవరి 8న తుది జాబితా వెలువడుతుందన్నారు. బీజేపీ నేత శ్రీనివాస్, బీఆర్ఎస్ నుంచి చింతల నర్సింహులు, బీఎస్పీ నుంచి నర్సింహులు, కాంగ్రెస్ నేతఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

## జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు రాజేశ్ కుమార్‌గౌడ్



బొల్లారం, డిసెంబర్ 27: 31వ సబ్ జూనియర్ జాతీయ స్థాయి త్రోబాల్ చాంపియన్ షిప్ 2023–24 పోటీలకు బొల్లారం ఆదర్శ పాఠశాలకు చెందిన టెన్త్ విద్యార్థి రాజేశ్ కుమార్‌గౌడ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శైలజ, పీడీ శశిరేఖ బుధవారం సంయుక్తంగా తెలిపారు. ఈనెల 27 నుంచి 29 వరకు జార్ఖండ్ రాష్ట్రంలోని చందిల్ పట్టణంలో జరిగే త్రోబాల్ క్రీడల్లో రాజేశ్‌కుమార్‌గౌడ్ తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో రాష్ట్రం తరపున ఎంపికైన విద్యార్థి రాజేశ్ కుమార్‌ను ఉపాధ్యాయులు, మున్సిపల్‌లోని పలువురు ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు. ఇప్పటికే పోటీల్లో పాల్గొనేందుకు రాజేశ్ కుమార్‌గౌడ్ జార్ఖండ్ రాష్ట్రానికి బయలుదేరి వెళ్లినట్లు వారు తెలిపారు.

## ముగిసిన దీపోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

ఝరాసంగం, డిసెంబర్ 27: దత్తగిరి మహరాజ్ ఆశ్రమంలో ప్రతి సంవత్సరం దత్తత్రేయ జయంతి రోజు 21,600 దీపారాధన అత్యంత వైభవంగా బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతులు వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహరాజ్, డాక్టర్ సిద్ధేశ్వర్‌స్వామి నిర్వహిస్తారు. మంగళవారం రాత్రి దీపారాధన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపూరం శివకుమార్, సామాజిక సమరసత తెలంగాణ కన్వీనర్ అప్పల ప్రసాద్ హాజరై దీపోత్సవాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. శివలింగాకారంలో ఏర్పాటు చేసిన దీపోత్సవంలో మహిళలు, చిన్నారులు, భక్తులు పాల్గొని దీపాలు వెలిగించారు. అనంతరం ఆశ్రమ ఆవరణలో ఆధ్యాత్మిక ధర్మ సభలో 1992 నుంచి అయోధ్యలోని అక్షింతలను ఝరాసంగం, కోహీర్ మండలాల్లోని 76 గ్రామాల రామ భక్తులకు పంపిణీ చేశారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా స్థానిక ఎస్సై రాజేందర్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రల భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

**వైభవంగా దత్తాత్రేయ పల్లకీసేవ**

దత్తాత్రేయ స్వామివారి పల్లకీ సేవ బుధవారం ఉదయం బర్ధీపూర్ మాడ వీధుల్లో ఊరేగించారు. బర్ధీపూర్ గ్రామానికి చెందిన మహిళా భక్తులు నిండు కలశములతో పల్లకీకి స్వాగతం పలికారు. మంగళ వాయిద్యాల మధ్య కొనసాగిన పల్లకీ సేవలో తెలంగాణ రాష్ట్రంతో పాటు కర్ణాటక చాంగులేర్‌కు చెందిన కళాకారులు చేసిన దండాలు, ఖడ్గాలు, భజన కీర్తనలు ఆకట్టుకున్నాయి.

# ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

**ఎమ్మెల్సీ యాదవరెడ్డి, అమెరికా తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు జయంత్‌రెడ్డి**



గజ్వేల్‌లో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, అమెరికా తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు జయంత్‌రెడ్డి

గజ్వేల్, డిసెంబర్ 27: గ్రామీణ ప్రాంత ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో మందికి లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, అమెరికా తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు జయంత్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఆవరణలో అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందన్నారు. వైద్య శిబిరం విజయవంతం కావడం సంతోషంగా ఉందన్నారు. అనుభవజ్ఞులైన వైద్యులచే పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతోపాటు సలహాలు, సూచనలు అందించిన వైద్యబృందానికి దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమెరికా తెలుగు ఫౌండర్ హనుమంతరెడ్డి, భీమ్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి కాశీనాథ్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మార్కెట్ కార్యదర్శి జాన్‌వెస్లీ, ఎంపీపీ అమరావతి, జడ్పీటీసీ మల్లేశం, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, ఐఎంఏ అధ్యక్షుడు లింగం, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అమర్నాథ్‌రావు, వైద్యులు పెంటాచారి, నరేశ్‌బాబు, మల్లయ్య, కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, లయన్ పరమేశ్వరాచారి, సంజయ్‌గుప్తా, గోలి సంతోష్, భాస్కర్, ఎన్సీ సంతోష్, సత్తయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గజగట్లపల్లి టీచర్ వెంకటకృష్ణారెడ్డి సస్పెన్షన్

- బడికి రాకున్నా నాలుగు నెలల జీతం తీసుకున్న ఉపాధ్యాయుడు
- ఆరోపణలపై 10 రోజుల్లో హెచ్‌ఎం వివరణ ఇవ్వాలి: డీఈవో

మెదక్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లి పాఠశాలలో తెలుగు పండిట్ ఉపాధ్యాయుడు వెంకటకృష్ణారెడ్డి సస్పెన్షన్‌కు గురయ్యారు. మనోహరాబాద్ మండలం పాలాట యూపీఎస్‌లో తెలుగు పండిట్ వెంకటకృష్ణారెడ్డి ఆగస్టులో డిప్యుటేషన్‌పై చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లి ప్రాథమిక పాఠశాలకు వచ్చారు. ఇదిలాఉండగా పాఠశాలకు డిప్యుటేషన్‌పై వెంకటకృష్ణారెడ్డి వచ్చినట్లు పాఠశాల పరిధిలోని స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రవీందర్‌రెడ్డికి కూడా సమాచారం లేదు. అయితే గజగట్లపల్లి పాఠశాలకు ఒక్క రోజు కూడా పాఠశాలకు రాలేదు. అంతేకాదు నాలుగు నెలల పాటు పాఠశాలకు వెళ్లకుండా జీతం తీసుకున్నాడు. ఈ విషయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రణీద్‌కుమార్ తెలుగు పండిట్ వెంకటకృష్ణారెడ్డి బడికి రాకున్నా అటెండెన్స్ సర్టిఫికెట్ ఇచ్చారు. అసలు తెలుగు పండిట్ ఉపాధ్యాయుడు జడ్పీ పాఠశాలల్లోనే విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. కానీ డిప్యుటేషన్‌పై ప్రాథమిక పాఠశాలకు ఎలా వచ్చాడని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

**పది రోజుల్లో ఆరోపణలపై వివరణ ఇవ్వాలి**

గజగట్లపల్లి పాఠశాల తెలుగు పండిట్ వెంకట కృష్ణారెడ్డిపై వచ్చిన ఆరోపణలపై పది రోజుల్లో వివరణ ఇవ్వాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రణీద్‌కుమార్‌కు డీఈవో కార్యాలయం నుంచి నోటీసులు అందజేశారు. పది రోజుల్లో వివరణ ఇవ్వకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డీఈవో రాధాకృష్ణ తెలిపారు.

## జిన్నారం రెవెన్యూ కార్యాలయానికి కరెంట్ కట్

- ఐదేండ్లుగా చెల్లించని బిల్లు రూ.9లక్షలు
- రూ.3లక్షలు చెల్లించడంతో తిరిగి కరెంట్ కనెక్షన్ పునరుద్ధరణ
- మధ్యాహ్నం వరకు నిలిచిపోయిన కార్యాలయ పనులు, ప్రజల అవస్థలు

జిన్నారం, డిసెంబర్ 27 : జిన్నారం రెవెన్యూ కార్యాలయానికి కరెంట్ సరఫరా నిలిచిపోయింది. ఐదేండ్లుగా రూ.9లక్షల బిల్లు చెల్లించకపోవడంతో మంగళవారం సాయంత్రమే కార్యాలయానికి అధికారులు కరెంట్ సరఫరాను నిలిపివేశారు. బుధవారం మధ్యాహ్నం వరకు రెవెన్యూ కార్యాలయంలో ఫైళ్లు ముందుకు జరుగలేదు. కంప్యూటర్లు ఆన్ కాలేదు. దీంతో అధికారులు, పనుల కోసం వివిధ గ్రామాలు, ప్రాంతాల నుంచి వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రూ.3లక్షల కరెంట్ బిల్లు చెల్లించడంతో రెవెన్యూ కార్యాలయానికి తిరిగి కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు. కరెంట్ సరఫరా నిలిపివేసినట్లు మెస్సేజ్‌లు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. కాగా రెవెన్యూ కార్యాలయ కరెంట్ బిల్లు ఐదేండ్లుగా చెల్లించకపోవడంతో రూ.9లక్షల బిల్లు పేరుకుపోయిందని, కార్యాలయానికి కరెంట్ సరఫరాను ట్రాన్స్‌కో అధికారులు నిలిపివేసిన విషయాన్ని తెలుసుకునేందుకు తహసీల్దార్ రవికుమార్‌ను సంప్రదించగా...అలాంటిదేమి లేదని, రెవెన్యూ కార్యాలయంలో కంప్యూటర్లు యూపీఎస్ పని చేయకపోవడంతో పనులు ఆగిపోయాయని తెలిపారు. జిన్నారం ట్రాన్స్‌కో ఏఈ రాజు నాయక్‌ను సంప్రదించగా రెవెన్యూ కార్యాలయానికి ఉన్నది ప్రీపెయిడ్ మీటర్ అని, రూ.9లక్షల బిల్లు కావడంతో మంగళవారం సాయంత్రమే ఆటోమెటిక్‌గా కరెంట్ సరఫరా నిలిచిపోయిందన్నారు. రూ.3లక్షల కరెంట్ బిల్లు చెల్లించడంతో తిరిగి కరెంట్ సరఫరా అయ్యిందని ఏఈ తెలిపారు.

## వాహనదారులు రాయితీని వినియోగించుకోవాలి

సిద్దిపేట టౌన్,డిసెంబర్ 27 : ఈ చలాన్ పెండింగ్ వాహనదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పిందని సిద్దిపేట అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాస్‌రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సిద్దిపేట జిల్లాలో ట్రాఫిక్ చలాన్లకు భారీ రాయితీని ప్రకటించిందని, ఈ అవకాశాన్ని వాహనదారులు సద్వినియోగించుకోవాలని కోరారు. జనవరి 10 తేదీ వరకు ఈ చలాన్ రాయితీ వర్తిస్తుందన్నారు. ద్విచక్ర వాహదారులకు 80 శాతం, ఆర్టీసీ బస్సులు, ఆటోలు,తోపుడు బండ్ల వారికి 90 శాతం, నాలుగు చక్రాలు, లారీ, భారీ వాహనాలకు 60 శాతం రాయితీ కల్పించిందని చెప్పారు. ఈ చలాన్ జరిమానాలను ఆన్‌లైన్, పేటీఎం,గూగుల్‌పే, మీసేవ, ఈ సేవ ద్వారా చెల్లించుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాల కోసం తెలంగాణ ఈ చలాన్ వెబ్‌సైట్ https : //echallan.tspolice.gov.in /publicview/ చూడాలని సూచించారు.

## ఆరు గ్యారంటీలు అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రజాపాలన గ్రామ సభలను సమన్వయంతో విజయవంతం చేయాలి
- రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, డిసెంబర్ 27: ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీని అమలు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం హుస్నాబాద్ పట్టణంలోని తిరుమల గార్డెన్స్‌లో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్ని అడ్డంకులైనా ఎదుర్కొని ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందనే ధీమా వ్యక్తం చేశారు. అభయ హస్తం గ్యారంటీల అమలు కోసం గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామ సభలను అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఉండి విజయవంతం చేయాలని కోరారు. గ్రామాలు, వార్డుల వారీగా గ్రామ సభలు జరుగుతాయని, వ్యక్తిగతంగా కాకుండా కుటుంబానికో దరఖాస్తు చొప్పున అధికారులకు అందజేయాలని సూచించారు. దరఖాస్తులో ఏ గ్యారంటీ కావాలో పొందు పర్చాలన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్యారంటీలకు సంబంధించినవి కాకుండా ఇతర సమస్యల గురించి కూడా దరఖాస్తు చేసుకునేందుకు గ్రామ సభలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇచ్చిన ప్రతి దరఖాస్తుకు విధిగా రసీదు తీసుకోవాలన్నారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లో రెండు గ్యారంటీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అనేది మహిళలకు గొప్ప వరమని, ఇప్పటి వరకు 4కోట్ల మంది జీరో టికెట్‌పై ప్రయాణం చేశారని తెలిపారు. అవసరమైన మేరకు కొత్త బస్సులను తీసుకొస్తామని, ప్రజలకు అన్ని రూట్లలో బస్సులు నడుపుతామని స్పష్టం చేశారు. ప్రతి నెలా 5వ తేదీలోపు ఉద్యోగుల వేతనాలు, అన్ని రకాల పింఛన్లు బ్యాంకు ఖాతాల్లో వేసేలా ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ప్రజాపాలన గ్రామ సభల విజయవంతానికి ప్రజలు సహకరించాలని, సజావుగా సభలు జరిగే అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.